దంచికొట్టిన వాన

రామాయంపేటలో వర్షానికి తడిసిన ధాన్యం

రామాయంపేటలో బస్తాలను ఆరబెడుతున్న రైతులు

వెల్దుర్తి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ధాన్యం

- అర్ధరాత్రి భారీ వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం సంచులు
- ఆందోళనలో అన్నదాతలు
- రెండు గంటలు ఏకధాటిగా కురిసిన వర్షం

రామాయంపేట, మే 21: అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ధాన్యం బస్తాలు, ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. రామాయంపేటతో పాటు మండలంలోని కోనాపూర్, ఝూన్సీలింగాపూర్, అక్కన్నపేట తదితర గ్రామాల్లో బుధవారం వాన దంచికొట్టింది. ఉదయం నుంచి ఎండ, ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది.

వెల్దుర్తి మండలంలో..

వెల్దుర్తి, మే 21: అకాల వర్షాలతో రైతన్న నానా తిప్పలు పడుతున్నా, పట్టించుకునే వారు కరువయ్యారు. బుధవారం తెల్లవారుజామున, సాయంత్రం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికీ ధాన్యంరాశుల నిల్వలు ఉండగా, రోజుల తరబడి రైతులు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశుల మధ్య నీరు నిలువడంతో ధాన్యం తడిసి, మొలకలు వస్తున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీళ్లపాలు అవుతుందని రైతులు వాపోతున్నారు.

వెల్దుర్తిలో కురుస్తున్న భారీ వర్షం

హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ నేత పుట్టిన రోజు


కృష్ణాగౌడ్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, మే 21: మాజీ మున్సిపల్ కౌన్సిలర్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి కృష్ణాగౌడ్ పుట్టిన రోజు వేడుకలు మెదక్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ సమక్షంలో బుధవారం నిర్వహించారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు అంజనేయులు, శ్రీనివాస్, జయరాజ్, కిశోర్, నాయకులు లింగారెడ్డి, ప్రభురెడ్డి, అరుణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

మెదక్ మున్సిపాలిటీ, మే 21: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లాలో 5840 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రథమ సంవత్సరానికి 3626 మంది, ద్వితీయ సంవత్సరానికి 2214 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా 22 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని సూచిస్తున్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

నిజామాబాద్ జట్టుకు బహుమతి అందజేస్తున్న గణేశ్‌రెడ్డి

తూప్రాన్, మే 21: రాష్ట్ర స్థాయి 11వ జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ముగిశాయి. అల్లాపూర్ టోల్ ప్లాజా సమీపంలోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల మైదానంలో సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ ఫైనల్‌లో ఆతిథ్య మెదక్ జిల్లా, నిజామాబాద్ జిల్లా జట్లు హోరాహోరీగా పోటీ పడ్డాయి. నిజామాబాద్ జట్టు విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నది. మెదక్ జిల్లా జట్టు రజత , హన్మకొండ జట్టు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నాయని మెదక్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ శర్మ తెలిపారు.మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.

24న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

మెదక్ మున్సిపాలిటీ, మే 21: మెదక్‌లోని అథ్లెటిక్స్ స్టేడియంలో ఈనెల 24న అండర్ -8, 10, 12 బాలబాలికలకు రన్స్, త్రో, జేమ్స్ విభాగాల్లో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటరమణ, మధుసూదన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం తీసుకుని శనివారం స్టేడియానికి రావాలని సూచించారు. జూన్ 1 నుంచి హైదరాబాద్‌లోని జింఖాన గ్రౌండ్‌లో స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపీయన్‌షిప్-2025 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 9963005540ను సంప్రదించాలన్నారు.

బస్సును ఢీకొన్న లారీ- పదిమందికి గాయాలు

రామాయంపేట, మే 21: రామాయంపేటలోని జాతీయ రహదారి కోమటిపల్లి వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీకొని పది మందికి గాయాలైన ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సు రామాయంపేటకు వస్తున్నది. కోమటిపల్లి జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ అదుపు తప్పి వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులోని పది మంది ప్రయాణికుల కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని ఎస్సై బాలరాజు వెంటనే 108 అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొల్చారం, మే 21: గుర్తు తెలియని మగ మృతదేహం కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుశవారం లభ్యమైంది. పోలీసుల కథనం ప్ర కారం.. పోతంశెట్టిపల్లి శివారులోని టీ జంక్షన్ నుంచి ఏడుపాయలకు వెళ్లే మార్గంలో బ్రిడ్జి వద్ద మంజీరా నది నీటిలో మృతదేహం పడి ఉన్న ట్లు మత్స్యకారులు పోతంశెట్టిపల్లి పంచాయతీ సెక్రటరీకి సమాచారం ఇచ్చారు. సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి, పరిశీలించారు. మృతుడి వయస్సు 30 నుంచి 40 ఏం డ్ల మధ్య ఉంటుందన్నారు. మృతుడి ఎడమవైపు చాతిపై సంగీత అని ఆంగ్లంలో రాసి ఉందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అరుందతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ గౌస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

కౌడిపల్లి, మే 21: చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సదాశివపల్లిలో జరిగింది. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చాకలి కృష్ణ(34) 6నెలల క్రితం కంటికి ఆపరేషన్ చేయించుకున్నాడు. రెండు నెలల క్రితం మరో కంటికి ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆరోగ్యంపై దిగులు గా ఉంటూ మనస్తాపానికి గురై ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతడిని వెతకుతుండగా గ్రామ శివారులోని కనికల చెరువు వద్ద ఉన్నాడని స్థానికులు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లిచూడగా కృష్ణ బట్టలు కట్టపై కనిపించాయి. గ్రామస్తుల సహాయంతో చెరువులో వెతికారు. రెస్క్యూటీం అధికారులు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

గొండ స్వామి (ఫైల్)

తూప్రాన్, మే 21: ఐదు రోజుల క్రితం నిద్రలో భవనంపై నుంచి కింద పడి, చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇస్లాంపూర్‌కు చెందిన నర్ర గొండ స్వామి (40) ఐదు రోజుల క్రితం భవనంపై పడుకున్నాడు. నిద్రలో భవనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గాంధీకి, అక్కడ నుంచి ఉస్మానియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఉపాధి పనులు పరిశీలిస్తున్న డీఆర్డీవో

మనోహరాబాద్, మే 21: ఉపాధి పనులపై సామాజిక తనిఖీని మనోహరాబాద్‌లోని రైతు వేదికలో బుధవారం నిర్వహించారు. డీఆర్డీవో రంగాచార్యులు హాజరై ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులు, నిధులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీవీవో శ్రీహరి, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, ఏపీవో ఆదినారాయణ, ఏఈ పీఆర్ మధుసూదన్, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చందు రెడ్డి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా నర్సాపూర్

మెదక్ అర్బన్: ఉత్తమ జిల్లాగా సర్టిఫికెట్‌ను అదనపు ఎస్పీ మహేందర్‌కు అందజేస్తున్న డీజీపీ జితేందర్

తూప్రాన్: ఏసీపీ వెంకట్ రెడ్డికి సర్టిఫికెట్ అందజేస్తున్న అడిషనల్ డీజీపీ అనిల్‌కుమార్

రాష్ట్ర డిజీపీ జితేందర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న తూప్రాన్ ఎస్ఐ శివానందం

- పోక్సో కేసుల్లో చార్జీషీట్ వేసినందుకు తూప్రాన్ డీఎస్పీకి రాష్ట్రంలో రెండో స్థానం
- మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

తూప్రాన్/నర్సాపూర్, మెదక్ అర్బన్, మే 21: పోలీస్ సేవల క్యూ ఆర్‌కోడ్ ఆఫ్ సిటిజెన్‌లో రాష్ట్రంలో ఉత్తమ జిల్లాగా మెదక్‌కు ఎంపిక చేసినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. పోలీస్‌ల పని తీరు, ప్రజలలో ఉన్న అభిప్రాయాలు తెలుసుకునేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ జనవరి 9, 2025 తేదీన క్యూ ఆర్‌కోడ్ ఆఫ్ సిటిజెన్ రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. జనవరి నుంచి ఇప్పటివరకు ప్రజలు ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా అన్ని జిల్లాలకు ర్యాంకులు పొందుపర్చినట్లు ఎస్పీ పేర్కొన్నారు. అందులో మెదక్ జిల్లా మెదటి స్థానానికి ఎంపికకావడం అభినందనీయమని తెలిపారు. డీజీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్టిఫికేషన్ కార్యక్రమంలో జిల్లా నుంచి అదనపు ఎస్పీ మహేందర్ డీజీపీ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నట్లు పేర్కొన్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో రాష్ట్రంలోనే 10 ఉత్తమ పోలీస్ స్టేషన్లలో మెదక్ జిల్లాకు చెందిన రెండు పోలీస్ స్టేషన్లు ఉండడం జిల్లా పోలీస్‌లు ప్రజలకు అందిస్తున్న సేవలకు నిదర్శనమని తెలిపారు. నర్సాపూర్ పోలీస్ స్టేషన్ మొదటి స్థానం తూప్రాన్ పోలీస్ స్టేషన్ 4వ స్థానం పొందిందని పేర్కొన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లకు చెందిన ఎస్‌హెచ్‌వోలు నర్సాపూర్ ఎస్సై లింగం, తూప్రాన్ ఎస్సై శివానందం డీజీపీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకోవడం అభినందనీయమన్నారు. పోక్సో కేసుల్లో ఐవోగా ఉండి 60 రోజుల్లోపే ఎక్కువగా చార్జిషీట్లను వేసినందుకు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి రాష్ట్రంలోనే రెండో స్థానం పొంది, అడిషనల్ డీజీపీ అనిల్‌కుమార్ చేతులమీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నారని తెలిపారు.

నర్సాపూర్: రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకుంటున్న నర్సాపూర్ ఎస్సై లింగం

వివాహానికి హాజరైన ఎమ్మెల్యే

కౌడిపల్లి, మే 21: మండలంలోని తిమ్మాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఉప్పరి సత్యనారాయణ కొడుకు సందీప్, వనిత, కంచనపల్లి గ్రామానికి చెందిన దుంపల నర్సింలు కొడుకు ప్రవీణ్ కుమార్, మహాలక్ష్మి వివాహ వేడుకలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి బుధవారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

మాజీ వైస్ ఎంపీపీని పరామర్శించిన ఎమ్మెల్యే

శివ్వంపేట, మే 21: కొత్తపేటకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ రేవ రమాకాంత్‌రెడ్డి తండ్రి నర్సింహారెడ్డి (75) బుధవారం హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి రమాకాంత్‌రెడ్డిని పరామర్శించారు. ఎంపీపీ హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ మహేశ్‌గుప్తా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

తూప్రాన్, మే 21: మేస్త్రీలతో కారులో పనికి వెళ్తున్న వ్యక్తులను యావాపూర్ శివారులో బొలెరో ఢీకొట్టిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన పరశపోగు రమేశ్ బుధవారం నలుగురు మేస్త్రీలను కారులో ఎక్కించుకుని అనంతగిరిపల్లికి బయలుదేరాడు. యావాపూర్ శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న బొలెరో కారును ఢీకొట్టింది. దీంతో రమేశ్, ప్రవీణ్, కల్లు శివ, కల్లు సురేశ్, మరియదాస్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆర్వీఎం దవాఖానకు తరలించారు.

కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడమంటే
రైతులకు నోటీసులు జారీ చేసినట్లే

విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ, మే 21: కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడమంటే రైతులకు నోటీసులు జారీ చేసినట్లేనని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల అంజనేయులు అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయం దండుగ అన్న చోట పండగ చేసి చూపించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నా రు. కేసీఆర్‌కు, హరీశ్‌రావుకు నోటీసులు జారీ చేయడం ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రేనన్నారు. కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కేసీఆర్ బృహత్తర ప్రాజెక్టు కాళేశ్వరానికి రూపకల్పన చేశారన్నారు. కాళేశ్వరంతో తెలంగాణను సస్యశ్యామలం చేసి రైతులకు సాగనీటి ఘోష తీర్చిన అపర భగీరథుడు కేసీఆర్ అని కొనియాడారు. దేశంలోనే తెలంగాణను ధాన్యాగారంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కమిషన్ పేరుతో కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో జాతీయ స్థాయిలో కేసీఆర్‌కు వచ్చిన పేరు ప్రతిష్టలను ఓర్వలేకనే ఈ ప్రభుత్వం విషం కక్కుతుందన్నారు. స్వరాష్ట్ర కలను సాకారం చేసిన తెలంగాణ యోధుడిని విచారణ పేరిట ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిందని వారు ఆరోపించారు. పాలేవో, నీలేవో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. అవినీతి కమిషన్ల నుంచి దృష్టి మరల్చేందుకే కమిషన్ నోటీసుల డ్రామా కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతుందని మండిపడ్డారు. ఇచ్చిన దొంగ హామీలను అమలు చేయకుండా కమీషన్ల అవినీతి నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి కాళేశ్వరం కమిషన్‌తో కేసీఆర్‌కు నోటీసులు ఇప్పించడం తగదన్నారు. కమిటీల పేరుతో, విచారణల పేరుతో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కన పెట్టడానికే ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. కేసీఆర్‌కు న్యాయవ్యవస్థపై అపార గౌరవం ఉందని ముమ్మాటికి ధర్మమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ పట్టణ కో కన్వీనర్లు కృష్ణాగౌడ్, లింగారెడ్డి, మాజీ కౌన్సిలర్లు జయరాజ్, కిశోర్, శ్రీనివాస్, ప్రభురెడ్డి, షాకీర్, అరుణ్ పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించడమే లక్ష్యం: డీఈవో

రేగోడులో సూచనలిస్తున్న డీఈవో రాధాకిషన్

పాపన్నపేట, మే 21: విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని టీచర్లకు ఐదు రోజుల శిక్షణ చేపట్టినట్లు డీఈవో రాధాకిషన్ వెల్లడించారు. బుధవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 1600 మంది ఎస్జీటీలకు 1800 మంది స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆయన వెంట ఎంఈవో ప్రతాపరెడ్డి తదితరులు ఉన్నారు.

రేగోడులో సందర్శించిన డీఈవో

రేగోడ్, మే 21: రేగోడ్ జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని డీఈవో రాధాకిషన్ సందర్శించారు. ఇక్కడ నేర్చుకున్న మెలకువలను బోధన సమయంలో విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని సూచించారు. ఎంఈవో గురునాథ్, రిసోర్స్‌పర్సన్స్ ఉన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, మే 21: ప్రతి విద్యార్థిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని డీఈవో అన్నారు. విద్యాశాఖ సమగ్ర శిక్షణ ద్వారా ఇస్తున్న శిక్షణకు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతిభలో భరోసా, భద్రత కల్పించాలన్నారు. పాఠ్యపుస్తకాలు, కరదీపికలను సమ్మిళితం చేసి బోదించాలన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

అల్లాదుర్గం, మే 21: శిక్షణలో చెప్పిన అంశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సూచించారు. అల్లాదుర్గంలోని జడ్పీహెచ్ఎస్ (బాలుర)లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యాక్రమాన్ని తనిఖీ చేశారు. భోదన మెరుగు పరచడానికి, నూతన విద్యాసంవత్సరానికి ఉపాధ్యాయులను సంసిద్ధులను చేయటానికి, విద్యా ప్రమాణాలు పెంచటానికి శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి ధనుంజయ, ఆర్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

యాదవులకు రూ.5వేల కోట్లు కేటాయించాలి

తూప్రాన్, మే 21: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లో యాదవులకు రూ.5 వేల కోట్లు కేటాయించాలని, యాదవ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆబోతు వెంకటేశ్ యాదవ్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్ల, మేకల ఫెడరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు ఈనెల 29లోగా గాంధీ భవన్‌లో నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిగె శ్రీనివాస్ యాదవ్, జీహెచ్ఎంసీ అధ్యక్షుడు రవి యాదవ్, ప్రచార కమిటీ చైర్మన్ గంగుల ఐలేశ్ యాదవ్, రమేశ్ యాదవ్, నాగరాజు యాదవ్, మల్లేశ్ యాదవ్, పిచ్చయ్య యాదవ్, ప్రశాంత్ యాదవ్ పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

రేగోడ్, మే 21: ఉరేసుకుని వ్యక్తి మృతిచెందిన ఘటన వెంకటాపూర్ మక్తలో జరిగింది. ఎస్సై పోచయ్య తెలిపిన వివరాలు.. నీరుడి జ్ఞానేశ్వర్ మిషన్ భగీరథలో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తుండేవాడు. గతం ఈయనపై కేసు ఉండడంతో ఉద్యోగం కోల్పోయాడు. దీంతో మానసిక ఒత్తిడికి గురయ్యాడు. ఈ నెల 20న తన కొడుకు పెద్దశంకరంపేట వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. అతని తండ్రి పొలంలో చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బోధనలో సాంకేతికతను జోడించాలి
- రాష్ట్ర పరిశీలకుడు భాస్కర్ దేశ్

ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న భాస్కర్ దేశ్

మెదక్ మున్సిపాలిటీ, మే 21: బోధనలో అత్యాధునిక సాంకేతికతను జోడించి ఉపాధ్యాయులు బోధించాలని రాష్ట్ర పరిశీలకుడు భాస్కర్ దేశ్ అన్నారు. మెదక్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలో కొనసాగుతున్న భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయుల రెండో రోజు శిక్షణ శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యత గల ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఉత్తమ బోధన పద్ధతులతో విద్యార్థులకు దిశానిర్దేశం చేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, కోర్స్ కోఆర్డినేటర్ రేఖ, రిసోర్స్‌పర్సన్‌లు మహేందర్, రాజ్‌కుమార్, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే ఉపేక్షించం

చిప్పల్‌తుర్తిలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి హేమలత

నర్సాపూర్, మే 21: కల్తీ విత్తనాలు విక్రయిస్తే ఉపేక్షించేది లేదని జూనియర్ సివిల్ జడ్జి హేమలత హెచ్చరించారు. బుధవారం మండలంలోని చిప్పల్‌తుర్తిలో రైతులతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఫర్టిలైజర్ యజమానులు కల్తీ విత్తనాలు అమ్మితే చట్టరీత్యా కఠినంగా చర్యలు తీసుకుంటామని జడ్జి హెచ్చరించారు. సదస్సులో ఏఎస్ఐ సుందర్ రాజు, ఏఈవో తేజస్విని, సైంటిస్టులు డా.చైతన్య, గాయత్రి, పూజ, పంచాయతీ కార్యదర్శి శృతిజా, లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉండాలి

ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ రాజ్‌నారాయణ

రామాయంపేట, మే 21: వానకాలం సాగుకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సిద్ధంగా ఉంచాలని ఇన్‌చార్జి ఏడీఏ రాజ్‌నారాయణ పేర్కొన్నారు. బుధవారం రామాయంపేటలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లోని రికార్డులు తనిఖీ చేశారు. ప్రతి డీలర్ దుకాణ లైసెన్సును రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు కొన్న రైతులకు రసీదు ఇవ్వాలన్నారు.

కుంటలో చేపలు మృత్యువాత

నర్సాపూర్, మే 21: మున్సిపాలిటీలోని తూప్రాన్ మార్గంలో ఉన్న కోమటికుంటలో మత్స్యకారులు వదిలిన చేపలు బుధవారం మృతి చెంది నీటిలో తేలాయి. మున్సిపాలిటీలోని పలు కాలనీల్లోని మురుగు నీరు అండర్ డ్రైనేజ్ ద్వారా కోమటి కుంటలోకి చేరుతున్నాయని, దీంతో నీరు కాలుష్యమై చేపలు మృతి చెందాయని మత్స్యకారులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు.

నాణ్యమైన విద్య అందించాలి

రామాయంపేట, మే 21: నాణ్యమైన విద్యను అందించాలని అప్పుడే ఉపాధ్యాయుడికి పేరు వస్తుందని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం రామాయంపేటలో రెండో రోజు టీచర్ల శిక్షణలో ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో బడిబాట చేపట్టాలన్నారు. విద్యార్థుల తల్లి దండ్రుల ఇంటికెళ్లి బడికి రాని పిల్లలుంటే పంపాలని చెప్పాలన్నారు.

కొడపాక సబ్ స్టేషన్ సమస్యలు పట్టవా?
రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా సభ్యుడు శశిధర్‌రెడ్డి

పాపన్నపేట, మే 21: ప్రమాదాలు జరిగితే గాని కొడపాక సబ్‌స్టేషన్‌ను పట్టించుకోరా అంటూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా సభ్యుడు శశిధర్‌రెడ్డి ఆగ్ర